

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి. మార్కెట్‌కు 628 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.145

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.145 పలికింది. కనిష్టం రూ.120, సరాసరి రూ.133 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.2°/21.8°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. వాయువ్య దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

పశు వైద్యానికి ధీమా

- జిల్లాకు రూ.98 లక్షల విలువైన మందులు



మందులను పరిశీలిస్తున్న పశువైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: రోగాల బారిన పడి ఒక్క పాడిపశువు, జీవం చనిపోకూడదన్న ఉద్దేశంతో వైఎస్ జగన్ సర్కార్ తగు చర్యలు చేపట్టింది. ఇప్పటికే సంచార పశు వైద్య సేవలతో పాడి పశువులకు వేగవంతమైన సేవలందిస్తోంది. తాజాగా జిల్లాకు రూ.98 లక్షల విలువైన మందులను సరఫరా చేసింది. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రానికి చేరుకున్న వీటిని అధికారులు ప్రశాంతిగ్రామం వద్ద రెండు గోడౌన్లతో పాటు జగరాజుపల్లి వద్ద ఉన్న మరో గోడౌన్‌లో భద్రపరిచారు. మంగళవారం జిల్లా పశువైద్యాధికారి సుభదాస్, వైద్యులు కృష్ణచైతన్య, శ్రీనివాసులు ఇతర సిబ్బంది జిల్లాలోని 89 పశువైద్యశాలలు, రైతు భరోసా కేంద్రాలకు వీటిని పంపిణీ చేశారు. జిల్లాలో 2.25 లక్షల పాడి పశువులతో పాటు 90 వేల వరకూ బర్రెలు, 26 లక్షల గొర్రెలు, 4.5 లక్షల మేకలతో పాటు కోళ్లు, పందులు, కుక్కలు ఇతర జంతువులు ఉన్నాయి. వీటి కోసం మందులు, మాత్రలు, సిరంజీలు, సిరప్‌లు రావడంతో వాటిని అన్ని కేంద్రాలకు పంపిణీ చేశారు.

టీబీ డ్యాంలో 79 టీఎంసీల నీరు




తుంగభద్ర జలాశయంలో తొణికిసలాడుతున్న నీరు

బొమ్మనహాళ్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం ఉదయానికి జలాశయంలో 79.168 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 36,766 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. హెచ్చెల్సీ, ఎల్ఎల్‌సీ, రాయబసవన్న కెనాల్‌కు 2,066 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో రూపంలో వెళ్తోంది. ఆంధ్రా సరిహద్దులో 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీకి 989 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

లోగో, మస్కట్ రూపకల్పనకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు సంబంధించిన మస్కట్, లోగో రూపకల్పనకు ఔత్సాహికుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆసక్తికలిగిన వారు ఆగస్టు 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ ఉదయభాస్కర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపికై న లోగో, మస్కట్‌లకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 30 వేలు, తృతీయ బహుమతి కింద రూ.20 వేలు చొప్పున అందిస్తారన్నారు. క్రీడోత్సవం ప్రారంభ రోజైన అక్టోబర్ 2న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్ర' లోగో, మస్కట్‌ను విడుదల చేస్తారన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే అభ్యర్థులు ఆగస్టు 7వ తేదీలోపు https://www.sports.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాయితీపై గడ్డివిత్తనాలు, దాణామృతం



జొన్న రకం గడ్డి



దాణామృతం

అనంతపురం అగ్రికల్చర్: పశువుల మేత కొరత రాకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఫాడర్ డెవలప్‌మెంట్ ఏడీ డాక్టర్ నాగార్జున రెడ్డి మంగళవారం 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అవసరమైన రైతులకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు (ఫాడర్ సీడ్), 60 శాతం రాయితీపై దాణామృతం (టోటల్ మిక్స్‌డ్ రేషన్- టీఎంఆర్) అందిస్తామన్నారు. ఆర్‌బీకేల్లో తమ వాటా చెల్లించి దరఖాస్తు చేసుకుంటే వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు. జొన్న రకం గడ్డి విత్తనాలు కిలోకు రాయితీ పోను రైతులు తమ వాటా కింద రూ.23 ప్రకారం, టీఎంఆర్ గడ్డి కోసం రాయితీ పోను కిలోకు రూ.6.50 ప్రకారం చెల్లించాలన్నారు. ఒక రైతుకు గరిష్ఠంగా 20 కిలోలు గడ్డి విత్తనాలు, 1800 కిలోల టీఎంఆర్ పంపిణీ చేస్తామని తెలిపారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హైవేపై రయ్ రయ్

ఉమ్మడి జిల్లాలో టోల్‌గేట్ల నుంచి రోజుకు రూ.కోటి

- మరూరు, కాశేపల్లి టోల్‌గేట్ల నుంచే 60 శాతం వసూలు
- హైవేల్లో నిమిషానికి 55 వాహనాల పయనం
- భారీగా పెరుగుతున్న నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం : జాతీయ రహదారులపై వాహనాలు రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. బెంగళూరు – హైదరాబాద్ జాతీయ రహదారి ఎక్కువ భాగం ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఉంది. ఈ రహదారి గుండా రోజూ వేలాది వాహనాలు గమ్యస్థానానికి చేరుకుంటున్నాయి. ఏటా సగటున 15 శాతం వాహనాల రాకపోకలు పెరుగుతున్నట్టు ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా) అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

నిమిషానికి 55 వాహనాలు

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని జాతీయ రహదారులపై మొత్తం 10 టోల్‌గేట్లు ఉన్నాయి. వీటిగుండా రోజుకు 80 వేల వాహనాల వరకు ప్రయాణిస్తున్నట్టు అంచనా. దీన్నిబట్టి చూస్తే అన్నిచోట్లా కలిపి నిమిషానికి సగటున 55 వాహనాలు టోల్‌గేట్లు దాటుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య 13 శాతం పెరిగినట్టు అంచనా వేస్తున్నారు. వీటిలో ఎక్కువ భాగం కార్లు ఉన్నట్టు తేలింది. ప్యాసింజర్ వాహనాలే ఎక్కువగా ప్రయాణిస్తున్నాయి.

టోల్‌గేట్ల ద్వారా రోజూ రూ.కోటి వసూలు

ఉమ్మడి జిల్లాలో టోల్‌గేట్ల ద్వారా రోజుకు రూ.90 లక్షల నుంచి కోటి రూపాయల వరకు వసూలవుతోంది. ప్రత్యేక సెలవు రోజులు, పర్వదినాల సందర్భంలో మరింత ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. 60 శాతం వసూళ్లు రాప్తాడు మండలం మరూర్, పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌గేట్ల ద్వారానే వస్తున్నాయి. ఇక్కడ ఒక్కో టోల్‌గేట్‌లో రోజుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ వసూలవుతోంది. మిగతా టోల్‌గేట్ల నుంచి రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వస్తున్నట్టు అంచనా. రానున్న ఏడాదిలో మరో రెండు టోల్‌గేట్లు అదనంగా వస్తున్నట్టు తెలుస్తోంది.

కార్ల విక్రయాల్లో దూకుడు

ఉమ్మడి జిల్లాలో కార్ల విక్రయాలు గతంతో పోల్చితే భారీగా పెరిగాయి. ముఖ్యంగా కరోనా నుంచి అనంతపురంలోని మెజార్టీ ప్రజలు కార్ల ప్రయాణాన్నే ఇష్టపడుతున్నారు. ఐదారేళ్ల కిందట నెలకు 150 కొత్త కార్లు కొనుగోలు అయితే మహా గొప్ప. కానీ 2022–23 ఆర్థిక సంవత్సరంలో వివిధ కార్ల షోరూముల్లో కొనుగోలు చేసినవి 400కుపైగా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే సంవత్సరానికి 5వేల కార్ల విక్రయాలు జరుగుతున్నాయంటే వాటి దూకుడును అంచనా వేయొచ్చు. వీటి వల్ల కూడా ఉమ్మడి జిల్లాలో రోడ్లు బిజీ అవుతున్నాయని చెప్పుకోవచ్చు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం టోల్‌గేట్లు **10**	రోజుకు సగటున వాహనాల రాకపోకలు **80** వేలు
టోల్‌గేట్ల ద్వారా రోజుకు వసూళ్లు **రూ.కోటి**	ఉమ్మడి జిల్లాలో స్టేట్ హైవే రోడ్లు **789** కిలోమీటర్లు

ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలో రోడ్లు **325** కిలోమీటర్లు



వాహనాలు పెరిగాయి



కరోనా తర్వాత నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు భారీగా పెరిగాయి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ కంటే ప్రైవేటు ట్రాన్స్‌పోర్టేషన్‌కు ప్రజలు ఇష్టపడుతున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతుండడం ద్వారా కొనుగోలు సామర్థ్యం కూడా పెరిగింది. గతంలో ఒక అంబాసిడర్ కారు, సెల్‌ఫోన్ ఉంటే గొప్పగా చూసేవాళ్లం. ఇప్పుడు ప్రతి ఒక్కరి దగ్గర సెల్‌ఫోను, చాలామంది వద్ద కార్లు కనిపిస్తున్నాయి. సొసైటీలో గొప్పగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సొంతంగా ద్విచక్రవాహనం, కార్లు కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్, అనంతపురం

టీడీపీ హయాంలో ప్రాజెక్టుల పేరుతో దోపిడీ

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: టీడీపీ హయాంలో ప్రాజెక్టుల పేరుతో కాంట్రాక్టర్లకు నిధులు దోచిపెట్టారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 3న చంద్రబాబు జిల్లా పర్యటన నేపథ్యంలో వర్షాలు ఎక్కడ పడకుండా పోతాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. ప్రాజెక్టులకు శిలాఫలకాలు ఆవిష్కరించినపుడు సమావేశం నిర్వహించిన చెట్టు కూడా ఎండిపోయిన ఘటన ప్రజలను వెంటాడుతోందన్నారు. చంద్రబాబు జీడిపల్లి రిజర్వాయర్ పర్యటన రద్దు చేసుకుంటే బాగుంటుందన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ వద్ద పంప్‌హౌస్ నిర్మాణ అంశం టీడీపీ హయాంలో ఇచ్చిన 68 జీఓలో ఎక్కడా లేదన్నారు. 128 కిలోమీటర్ల మేర కాలువ పొడవు చూపించారని, శ్రీశైలం నుంచి చిత్తూరు జిల్లాకు 560 కిలోమీటర్లు ఉందన్నారు. పేరూరు జల సాధన సమితి పేరుతో పేరూరు డ్యాంకు హంద్రీ–నీవా నీటిని ఇవ్వాలని ఉద్యమాన్ని తీసుకొచ్చింది తానేనని ప్రకాష్‌రెడ్డి అన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు కాలువ తవ్వి మూడవ లిఫ్ట్ బోరంపల్లి ప్రాంతం నుంచి కళ్యాణదుర్గం, కంబదూరు మండలాల మీదుగా పేరూరు డ్యాంను నీటితో నింపాలని ప్రతిపాదనలు ఇవ్వగానే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెంటనే రూ.90 కోట్లతో డీపీఆర్ చేయించారన్నారు. 2009లో రాప్తాడులో జరిగిన బహిరంగ సభలో హంద్రీ–నీవా నుంచి పేరూరు డ్యామ్‌కు నీళ్లు ఇస్తామని వైఎస్సార్ ప్రకటించారన్నారు.

జీడిపల్లి – పేరూరు ప్రాజెక్టు పచ్చిమోసం

టీడీపీ హయాంలో ప్రకటించిన జీడిపల్లి– పేరూరు ప్రాజెక్టు అనేది పచ్చి మోసం, దగా అని ప్రకాష్‌రెడ్డి అన్నారు. ఎందుకంటే ఈ ప్రాజెక్టుకు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక హంద్రీ–నీవా 40 టీఎంసీల సాగునీటి ప్రాజెక్టుగా మార్చి మొదటివిడత జీడిపల్లి రిజర్వాయర్ వరకు పనులు పూర్తి చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల తర్వాత జీడిపల్లి –అప్పర్ పెన్నార్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పేరుతో రూ.1,300 కోట్లతో డీపీఆర్ ఇచ్చారని, దీనిపై ఆరోపణలు రావడంతో తిరిగి రూ.800 కోట్లకు మార్పు చేశారన్నారు. పేరూరు డ్యామ్‌కు ఒక టీఎంసీ నీటిని కేటాయిస్తూ జీఓ తెచ్చింది తామేనని, ఇచ్చింది జగనన్న అని, చెప్పిన మాట ప్రకారమే ప్రభుత్వం నుంచి రూపాయి డబ్బు తీసుకోకుండా దాతలు, రైతుల సహకారంతో పెన్నానదిలో 40 కి.మీ కాలువ తవ్వించి పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామన్నారు. తమ నియోజకవర్గంలోనూ ఇంటి పట్టాల విషయంలో కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల కోసం జిల్లాలో చేపట్టిన భూసేకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ... జాతీయ రహదారుల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లింపు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ద్వారా చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద ఇండస్ట్రియల్ పార్కు పనులు, పెనుకొండ మండలం గొందిపల్లి మల్టీమోడల్ లాజిస్టిక్‌పార్క్ పనులను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎన్‌హెచ్ 342, 716జీ, బెంగళూరు, కడప, విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి అవార్డు పాస్ చేసిన భూములకు త్వరితగతిన పరిహారం చెల్లించాలన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో రీసర్వే పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. రెండో విడతలో భాగంగా జిల్లాలో 59 గ్రామాలకు గాను ఇప్పటి వరకూ 27 గ్రామాల్లో 13 నోటిఫికేషన్ పూర్తయిందని, తక్కిన గ్రామాల్లో నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకుని రెండు వారాల్లో పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పుట్టపర్తి, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, ఏపీఐఐసీ అధికారి మురళీమోహన్, రైల్వే శాఖ డీఈ నాగభూషణం, ఎన్‌హెచ్ డీఈ జగదీష్ గుప్తా, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోక్సో కేసుల్లో దర్యాప్తు పక్కాగా సాగాలి

- దోషులకు శిక్ష పడేలా సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించాలి
- పోలీసు సిబ్బందికి ఎస్పీ ఎస్.వీ మాధవరెడ్డి ఆదేశం



మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: దర్యాప్తులో జరిగే చిన్న చిన్న తప్పిదాలతో దోషులు శిక్షల నుంచి తప్పించుకుంటున్నారని, భవిష్యత్‌లో అలా జరగకుండా ప్రతి పోలీసు అధికారి దర్యాప్తు పక్కాగా చేసి సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించాలని ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. పోక్సో కేసుల దర్యాప్తులో అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళవారం ఆయన పోలీసు కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోర్టుల్లో పెండింగ్ ఉన్న 75 కేసులు, వాటి పూర్వపరాలు... ప్రస్తుతం ఆ కేసులు స్థితిగతుల గురించి చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ముఖ్యమైన కేసుల సమయంలో విచారణ అధికారులు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌తో కలిసి కోర్టుకు హాజరై దోషులకు శిక్ష పడేలా చూడాలన్నారు. సాక్షులకు ముందుగా కేసు పూర్వపరాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న వారిపై కోర్టులో లిఖిత పూర్వక వాదన నమోదు చేయాలన్నారు. కేసుకు సంబంధించి పూర్తి సమాచారం పీపీకి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ రామునాయక్, పీపీలు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు



మాట్లాడుతున్న డ్వామా పీడీ రామాంజనేయులు, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి

పుట్టపర్తి అర్బన్: భూగర్భజల మట్టం పెంపొందించేందుకు జిల్లాలోని 142 జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, డ్వామా పీడీ రామాంజనేయులు ఆదేశించారు. మంగళవారం వారు పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు, ఉపాధి హామీ పథకం ఏపీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వృథా నీటితో పాటు వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేయడం వల్ల భూగర్భ జలమట్టం పెరిగి సమీపంలోని బోరు బావుల్లో నీటి లభ్యత పెరుగుతుందన్నారు. ప్రభుత్వం పేదల కోసం ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటి వద్దా ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలన్నారు. ఇందు కోసం ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.6 వేలు మంజూరు చేస్తోందన్నారు. 4వ తేదీలోపు ప్రతి మండలంలోనూ సచివాలయ సిబ్బంది, హౌసింగ్, ఉపాధి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇంకుడు గుంతలు ఎక్కడెక్కడ తవ్వాలో 5వ తేదీ నాటికి జాబితా రూపొందించాలన్నారు. అలాగే వాటిని ఆన్‌లైన్ చేయడం, లబ్ధిదారుల వారీగా ఎస్టిమేషన్ తయారు చేయడం, అనుమతి పొందిన తర్వాత ఇంకుడు గుంతలు తవ్వకం పనులు ప్రారంభించాలన్నారు.

బిడ్డా.. నేనిక్కడ ఉండలేను!

- కొడుకు మరణం జీర్ణించుకోలేక.. కూతురితో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ తల్లి మృతి
- కూతురి పరిస్థితి విషమం

ఎట్టా పోతివిరా బిడ్డా ప్రతాపా
మీ నాయనలాగే మమ్మల్ని వదలి అట్టిట్టా పోతివిరా
ఇంట్లో దీపం వెలిగినా... అంతా చీకటేనయ్యా
మా జీవితాలు అంధకారం అయ్యాయయ్యా
జాలిచూపే మనుషులు ఇక్కడ లేరయ్యా
నీకేమైందో...ఎందుకు ఎళ్లిపోయావో
ఎలా చెప్పేదయ్యా...
నువ్వుంటే ధైర్యంగా ఉండేదయ్యా
మా జీవితమే నువ్వైనప్పుడు...
నువ్వులేని ఈ జీవితం మాకెందుకయ్యా
వస్తున్నా...చెల్లితో కలిసి నేనూ వస్తున్నా బిడ్డా...

....అంటూ ఓ తల్లి ఇటీవల మృత్యువాత పడిన కుమారుడిని తలచుకుని కూతురితో కలిసి ఆత్మహత్యాయత్నం చేసింది. సకాలంలో స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది.

ముదిగుబ్బ: కుమారుడి మృతి జీర్ణించుకోలేక కూతురితో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా, కూతురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మండల పరిధిలోని ఇందుకూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన గంగిరెడ్డి, వెంకటలక్ష్మమ్మ(55) దంపతులు. వీరికి ప్రతాప్‌రెడ్డి, పుష్పావతి సంతానం. గంగిరెడ్డి కొన్నేళ్ల క్రితమే మృతి చెందగా, వెంకట లక్ష్మమ్మ కూతురు, కుమారుడే లోకంగా



బతికింది. వారం రోజుల క్రితం కుమారుడు ప్రతాప్‌రెడ్డి స్నేహితులతో కలిసి మద్యం సేవించి అనుమానాస్పదరీతిలో మృతి చెందాడు. ఆధారం అనుకున్న కుమారుడు దూరం కావడాన్ని వెంకటలక్ష్మమ్మ జీర్ణించుకోలేక పోయింది. ఈ క్రమంలోనే మంగళవారం ఆమె కూతురు పుష్పావతితో కలిసి ఊజీమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన ఇరుగూ పొరుగు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, వెంకటలక్ష్మమ్మ మృతి చెందింది. కూతురు పుష్పావతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తొలిరోజే 72 శాతం

- జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రారంభం



వెంగళమ్మచెరువులో ఓ వృద్ధురాలికి పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్న వలంటీర్ తిరుపాల్

పుట్టపర్తి అర్బన్: ఏ ఆసరాలేని వారికిచ్చే 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ మంగళవారం ప్రారంభమైంది. జిల్లాలో 2,61,340 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.72,55,75,250 మంజూరు చేసింది. వలంటీర్ల తెల్లవారుజామునుంచే ఇంటింటికీ తిరుగుతూ పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేశారు. ఫలితంగా తొలిరోజే 72 శాతం పూర్తయ్యింది. జిల్లాలోని 1,88,042 మంది లబ్ధిదారులకు వలంటీర్లు రూ.52,18,07,500 మొత్తాన్ని పంపిణీ చేశారు. పింఛన్ పంపిణీకి మరో నాలుగు రోజులు గడువు ఉందని, తప్పకుండా వందశాతం పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. 1వ తేదీ ఉదయమే పింఛన్ మొత్తం చేతికందడంతో అవ్వాతాతల్లో ముఖాల్లో చిరునవ్వు కనిపించింది.

శివాంజలి.. పరవశించెను భక్తమది



ప్రసంగిస్తున్న యోగీందర్ వర్మ

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర సత్యసాయి భక్తులు రెండోరోజు మంగళవారం సత్యసాయి సన్నిధిలో సంగీత విభావరి నిర్వహించారు. యూత్ బృందం సభ్యులు సత్యసాయి మహిమాన్విత ఘట్టాలను కొనియాడుతూ 'శివాంజలి' పేరుతో భక్తిగీతాలాపన చేశారు. సుమారు గంట పాటు చక్కటి స్వరాలతో నిర్వహించిన కచేరీతో భక్తులు ఆధ్యాత్మిక సాగరంలో మునిగిపోయారు. చక్కటి సంగీత కచేరీ నిర్వహించిన యూత్ బృందాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు జ్ఞాపికలు, నూతన వస్త్రాలతో సన్మానించారు. అంతకు ముందు హిమాచల్ ప్రదేశ్ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు యోగీందర్ వర్మ భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సత్యసాయి సేవలు హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర నలుమూలలా అందుతున్న తీరును వివరించారు.



సాయికుల్వంత్ హాలులో హిమాచల్ ప్రదేశ్ భక్తులు



సత్యసాయిని కీర్తిస్తూ గీతాలు ఆలపిస్తున్న హిమాచల్ ప్రదేశ్ యూత్ సభ్యులు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

నేడు బళ్లారి రాఘవ పురస్కారాల ప్రదానం



బళ్లారి రాఘవ

అనంతపురం కల్చరల్: తెలుగు రంగస్థలానికి వన్నె తెచ్చిన బళ్లారి రాఘవ జ్ఞాపకార్థం ఆయన పేరు మీద పురస్కారాలను అనంత రంగస్థలానికి విశేష సేవలందిస్తున్న వారికి బుధవారం ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు లలిత కళాపరిషత్తు అధ్యక్షకార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ మంగళవారం తెలిపారు. పౌరాణిక రంగంలో చిదంబరరెడ్డి, లక్ష్మీనారాయణ, సాంఘిక నాటకాల్లో అరుణ్‌బాబు, ఖాదర్‌బాషాను జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక చేశారు. బుధవారం సాయంత్రం లలిత కళాపరిషత్తు వేదికగా జరిగే ఈ వేడుకకు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు.

చెస్‌లో సత్తాచాటిన గుంతకల్లు వాసి



అనిల్‌కుమార్

గుంతకల్లు టౌన్: గుంతకల్లుకు చెందిన పూజారి అనిల్‌కుమార్ చెస్‌లో సత్తా చాటుకున్నాడు. ఈ ఏడాది మే నెలలో తిరువనంతపురంలో జరిగిన కాడిమిక్ కార్నివాల్ అంతర్జాతీయ చెస్ పోటీల్లో అద్భుతమైన ఆట తీరుతో మూడు నామ్స్ సాధించారు. ఈ క్రమంలోనే గత నెల 22, 23 తేదీల్లో భీమవరంలో జరిగిన బ్లిట్జ్ (స్పీడ్) విభాగంలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో 1,270వ రేటింగ్ సొంతం చేసుకున్నాడు. తన విజయానికి సహకరించిన కర్ణాటకం నాగార్జునకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



మంజుల (ఫైల్)

బత్తలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత మృతిచెందింది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... అనంతపురంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన నాగార్జున, మంజుల దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బేల్దారి పనులతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మంజుల మేనత్త మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు తనకల్లు మండలం సీఆర్‌పల్లికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. బత్తలపల్లి మండలం గుమ్మళ్లకుంట వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ఆటో ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులను స్థానికులు తొలుత ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం అక్కడి నుంచి కర్నూలులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మంజుల మృతి చెందింది. భర్త నాగార్జున అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మాట వినకపోతే మట్టుబెట్టాలని...

- కర్ణాటక వాసి కిడ్నాప్ కేసులో వీడిన మిస్టరీ
- ఏడుగురు కిడ్నాపర్ల అరెస్ట్
- రెండు కార్లు, పిడి బాకులు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కర్ణాటక వాసి కిడ్నాప్ కేసులో మిస్టరీని అనంత పోలీసులు ఛేదించారు. ఏడుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ధరణీకిషోర్ వెల్లడించారు. కర్ణాటకలోని రాయచూరు జిల్లా పురితిప్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా గెలుపొందిన లలీంద్రను ఈ నెల 29న అనంతపురంలోని బళ్లారి బైపాస్ రోడ్డులో కిడ్నాప్ చేసిన ఉదంతం తెలిసిందే. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలతో మూడు బృందాలుగా పోలీసులు విడిపోయి కిడ్నాపర్ల కోసం వేట సాగించారు. సోమవారం రాత్రి బళ్లారి నుంచి బెంగళూరుకు రెండు కార్లలో బయలుదేరిన కిడ్నాపర్లు డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం చెక్‌పోస్టు వద్దకు చేరుకోగానే పోలీసులు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. వీరి చెర నుంచి లలీంద్రను విడిపించారు.

పట్టుబడ్డారు ఇలా..

పురితిప్లి గ్రామ మేజర్ పంచాయతీకి ప్రతి రెండున్నరేళ్లకోసారి కొత్త సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. ఈ క్రమంలో ఈ నెల 2న కొత్త సర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. సర్పంచ్‌గా వార్డు సభ్యులు సరిత, శశికళ పోటీపడ్డారు. ఎనిమిది చొప్పున మొత్తం 16 మంది వార్డు సభ్యులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఈ క్రమంలో అనంతపురంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి తన వర్గానికి చెందిన 8 మంది వార్డు సభ్యులతో శశికళ చేరుకుంది. వీరిలో ఒకరి మద్దతు దొరికితే సర్పంచ్ స్థానం సరితకు దక్కుతుంది. దీంతో సరిత భర్త ప్రభాకర్ రంగంలో దిగి అదే గ్రామానికి చెందిన హనుమదాస్, హసికెళికు చెందిన ప్రశాంత్ వెంకటేష్, రవికుమార్, రైల్వే స్టేషన్ ఏరియా నివాసి సంజయ్, సీతాలాం కాలనీ నివాసి సతీష్‌కుమార్, మన్వీ తాలూకా ఆరోలి గ్రామానికి చెందిన మహేష్, రాయచూరుకు చెందిన బిన్నీ మహారాజ్, సురేష్ జిలాన్‌తో కలసి అనంతపురానికి వచ్చి లలీంద్రను కిడ్నాప్ చేశారు. అనంతపురం, కర్నూలు, బళ్లారి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసుల కళ్లుగప్పి కార్లలో తిరుగుతూ లలీంద్రను తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. మాట వినకపోవడంతో చివరకు మట్టుబెట్టాలని నిర్ణయించుకుని బళ్లారి నుంచి బెంగళూరుకు వెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. బిన్నీ మహారాజ్, సురేష్ జిలాన్ తప్పించుకున్నారు. ఏడుగురు నిందితుల నుంచి రెండు కార్లు, పిడిబాకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాగా, కిడ్నాప్ కేసు ఛేదించిన సీఐ ధరణీకిషోర్, సీసీఎస్ సీఐ జీటీ నాయుడు, ఎస్‌ఐలు సుధాకరయాదవ్, శ్రీకాంత్, సిబ్బందిని అనంత ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థిని బలవన్మరణం



శ్రావణి (ఫైల్)

హిందూపురం అర్బన్: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థిని శ్రావణి (18) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన నరసింహులుకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమార్తె శ్రావణి (18) హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కళాశాల క్యాంపస్‌లోని హాస్టల్‌లో ఉంటున్న ఆమె మంగళవారం ఉదయం 10.20 గంటలకు స్నానాలగదిలో అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన స్నేహితుల నుంచి సమాచారం అందుకున్న ప్రిన్సిపాల్ హరీష్ బాబు వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. క్రిమి సంహారక మందు తాగినట్లుగా వైద్యులు గుర్తించి చికిత్స మొదలు పెట్టారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ హరూన్‌బాషా కళాశాల వసతి గృహానికి చేరుకుని పరిశీలించారు. క్రిమి సంహారక మందు తాగే ముందు శ్రావణి రాసి పెట్టిన ఓ ఉత్తరాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో తన మృతికి కారకులు ఎవరూ కాదని ఆమె పేర్కొంది. క్యాన్సర్‌తో బాధపడుతున్నానని, తనకు ఆపరేషన్ అంటే భయమని వివరించింది. తల్లిదండ్రులకు తాను భారం కాకూడదనే ఉద్దేశ్యంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రేపు అనంతలక్ష్మిలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

అనంతపురం: నగర శివారులోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి రావు ఖోఖలే తెలిపారు. 2019, 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో బీఎస్సీ, బీఏ, బీకాం, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంకాం కోర్సులు పూర్తి చేసిన ఉమ్మడి జిల్లాకు చెందిన వారు అర్హులు.ఆసక్తి గల వారు రెజ్యూమ్, ప్రొవిజనల్ సర్టిఫికెట్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు తీసుకుని రావాలి.

పాలవెల్లువతో ఆర్థికాభివృద్ధి

- జాయింట్ కలెక్టర్ చేతన్



మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జగనన్న పాలవెల్లువతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని మహిళా పాడిరైతులకు జాయింట్ కలెక్టర్ చేతన్ సూచించారు. జగనన్న పాలవెల్లువ, జగనన్న గోరుముద్ద, రాగి జావ పంపిణీ తదితర అంశాలపై మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన సమీక్షించారు. సహకార డెయిరీ మహిళా పాడి రైతులకు ప్రయోజనకారీగా ఉందన్నారు. పశుసంవర్ధకశాఖలో పని చేస్తున్న డాక్టర్లు, డీడీలు, ఏడీలు, వలంటీర్ల సేవలను వినియోగించుకొని సర్వే నిర్వహించి పాడి రైతులను గుర్తించాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో జగనన్న పాలవెల్లువ కింద ఎంపిక చేసిన గ్రామాల్లో అమూల్ డెయిరీకి పాల సేకరణ చేపట్టాలన్నారు. జిల్లాలోని 7 మండలాల్లో కదిరి నియోజకవర్గంతో పాటు ఓడీచెరువు మండలంలోని 116 గ్రామాల్లో రోజుకు 17,500 లీటర్ల పాల సేకరణ జరుగుతోందన్నారు. పాడి పశువులు, గేదెల కొనుగోలుకు డీఆర్‌డీఏ, జిల్లా సహకార బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసే దిశగా ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సీసీఆర్సీ కార్డులను అందించి తద్వారా రుణాలు అందజేయాలన్నారు. రాగులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా రాగిజావ అందజేయాలన్నారు. గోరుముద్ద కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పంపిణీ సక్రమంగా అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, డీఎస్‌ఓ వంశీక్రిష్ణారెడ్డి, నోడలాఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, అమూల్ డెయిరీ ప్రతినిధి ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నివేదికలు పంపడంలో నిర్లక్ష్యమెందుకు?

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అసహనం



మాట్లాడుతున్న గిరిజమ్మ

అనంతపురం సిటీ: బీఆర్‌జీఎఫ్, ఎస్‌ఆర్‌ఐజీఎస్ సహా అనేక పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి సమగ్ర నివేదికలు జెడ్పీకి పంపాలని పదేపదే ఆదేశిస్తున్నా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీడీఓలపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు హాజరయ్యారు. సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ లలితా బాయితో కలసి గిరిజమ్మ సమీక్షించారు. నిర్లక్ష్యం వీడి రెండ్రోజుల్లోపు నివేదికలు పంపాలని స్పష్టం చేశారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలాల్లో ప్రభుత్వపరంగా జరిగే కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని ఆదేశించారు. శిలాఫలకాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పేర్లన్నీ ఉండేలా చూసుకోవాలన్నారు. సచివాలయాల సిబ్బంది విధులకు హాజరు కావడం లేదని ఎంపీడీఓలు మూకుమ్మడిగా ఆరోపించడంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలను తనిఖీ చేసి, అక్కడి పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం తినాలని, ఆ ఫొటోలను తమకు పంపాలని సూచించారు.

ఏపీఎన్జీఓ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

గుంతకల్లు టౌన్: ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే ఏపీఎన్జీఓ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఉద్యోగ, కార్మికులకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్‌లు, సమస్యలను సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్ ఛానల్, వారికి అందాల్సిన బకాయిలపై కూడా చర్చిస్తామన్నారు. రాష్ట్ర మహాసభలకు సచివాలయ ఉద్యోగులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యోగుల ఐక్యతను చాటాలని కోరారు. సమావేశంలో ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ జమీలాబేగం, గుంతకల్లు తాలూకా అధ్యక్షురాలు సంపూర్ణ ఎస్తేరు, ఉపాధ్యక్షుడు యు.ఎర్రిస్వామి, కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

‘నన్ను వేధిస్తున్నారు’



రాజశేఖరరెడ్డిని విచారణ చేస్తున్న కమిటీ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: దివ్యాంగుడనే కనికరం కూడా లేకుండా భూగర్భజల వనరుల శాఖ డైరెక్టర్ తనను వేధిస్తున్నారని జిల్లా భూగర్భ జల వనరుల శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నుంచి కర్నూలు జిల్లాకు వెళ్లిన కింది స్థాయి ఉద్యోగి.. ఉద్యోగుల స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ స్థానిక ప్రశాంతి గ్రామంలోని భూగర్భజల వనరుల శాఖలో విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ... నూతన జిల్లా ఏర్పాటు తర్వాత అనంతపురంలో పని చేస్తున్న అసిస్టెంట్ జియోఫిజిస్ట్ సువర్ణకుమార్ శ్రీసత్యసాయి జిల్లాకు వచ్చారన్నారు. ఈ క్రమంలో అక్కడి నుంచి రూ.1.5 లక్షల విలువైన భూగర్భ జలాలను పసిగట్టే రిసెస్టూటి మీటర్ తీసుకొచ్చారన్నారు. సదరు పరికరంతోనే విధులు నిర్వర్తించే సువర్ణకుమార్ మార్చి నుంచి సెలవుపై వెళ్లారని తెలిపారు. అనంతరం గత నెలలో బదిలీపై కర్నూలు జిల్లాకు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఆయన వెళుతూ సదరు పరికరాన్ని కార్యాలయంలో అందజేయకుండా తన వెంటే తీసుకెళ్లారని గుర్తు చేశారు. అనంతపురం జిల్లా నుండి వచ్చిన సమాచారం మేరకు సువర్ణకుమార్‌ను అడిగితే పరికరాన్ని ఆఫీస్‌లోని స్టోర్ రూంలో ఉంచానని బుకాయిస్తున్నారని, పరికరాన్ని అడిగినందుకు తనపై లేనిపోని ఆరోపణలతో డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. లీవులు ఇవ్వలేదని, ఎల్‌పీసీ ఇవ్వలేదని ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయాలన్నింటినీ డైరెక్టర్ జాన్‌సత్యరాజ్‌కు పలు మార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా డైరెక్టర్ నాపై విచారణ చేయిస్తున్నారన్నారు. గతంలోనూ పలు మార్లు శ్రీకాకుళం పంపుతానని బెదిరించారన్నారు. తిరుమలకు వెళ్లాలని సెలవు తీసుకున్నా.. మెమో ఇచ్చి ఇబ్బంది పెట్టారన్నారు. కాగా, విచారణ కోసం డీడీ విజయ్‌బాబు, జేడీ విశ్వేశ్వరరావు, సూపరింటెండెంట్ మౌనిక వచ్చిన విషయాన్ని తెలుసుకున్న జిల్లాలోని దివ్యాంగులు రాజశేఖరరెడ్డికి మద్దతుగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. విచారణ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, తహసీల్దార్ నవీన్‌కుమార్ తదితరులు అక్కడికి చేరుకుని వారికి సర్దిచెప్పి ధర్నాను విరమింపజేశారు.

దుస్తుల దుకాణం దగ్ధం



కాలిపోయిన దుకాణాన్ని చూపుతున్న రంగనాథ్

ధర్మవరం అర్బన్: స్థానిక పీఆర్‌టీ వీధిలో ఉన్న జీ-9 మెన్స్‌వేర్ దుకాణంలో మంటలు చెలరేగి రూ.30 లక్షల విలువైన దుస్తులు, ఫర్నీచర్ కాలి బూడిదయ్యాయి. పట్టణానికి చెందిన చెలిమి రంగనాథ్ సోమవారం రాత్రి వ్యాపారం ముగించుకుని తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దుకాణంలో మంటలు చెలరేగాయి. అటుగా వెళుతున్న వారు గమనించి సమాచారం అందించడంతో రంగనాథ్ అక్కడకు చేరుకున్నాడు. అప్పటికే దుకాణంలోని సామగ్రి కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసింది.

8 మందికి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్

అనంతపురం: అఖిల భారత చదరంగ సమాఖ్య, ప్రపంచ చదరంగ సమాఖ్య సంయుక్తంగా విడుదల చేసిన ఫిడే రేటింగ్‌లో అనంతపురం జిల్లాకు చెందిన 8 మంది చెస్ క్రీడాకారులున్నారు. ఈ మేరకు అనంతపురం చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు. రేటింగ్ దక్కించుకున్న వారిలో కొండూరు సాయిరాం (ఇంటర్నేషనల్ ఫిడే బ్లిట్జ్ రేటింగ్ -1,503), కేవీఎస్ చేతన్ రెడ్డి (1,331), అనిల్‌కుమార్ పూజారి (1,270), జానపాటి రోహిత్ (1,182), అస్మిత అనిమి (1,205), జొన్నగడ్డల నితీష్‌చౌదరి (1,122), భీమరాజు లక్ష్మీమణిదీప్ (1,065), యశస్విని అనిమి (1,033) ఉన్నారు.

గవిమఠం భూముల స్వాహాపై విచారణ

ఉరవకొండ: అన్యాక్రాంతమైన గవిమఠం భూముల అంశంపై విచారణకు అధికారులు సిద్ధమయ్యారు. కర్ణాటకలోని అసొండిలో దాదాపు రూ.10 కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమైన విషయాన్ని ‘గవి మఠం భూములు స్వాహా’ శీర్షికన మంగళవారం ‘సాక్షి’లో వెలువడిన కథనంపై దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మను ఆదేశించారు. దీంతో మఠం సిబ్బందితో కలసి ఆమె మంగళశారం ఉదయం అసొండి గ్రామంలో పర్యటించారు. చోటుచేసుకున్న అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులను కలసి రికార్డులు తీసుకున్నారు.

కౌన్సిలర్లకు షోకాజ్ నోటీసులు

సాక్షి, పుట్టపర్తి: పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన హిందూపురం మున్సిపల్ కౌన్సిలర్లకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న వారిలో 23వ వార్డు కౌన్సిలర్ అయూబ్, 5వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ అహమ్మద్ ఉన్నారు.

మెదడువాపుతో చిన్నారి మృతి



చైత్ర(ఫైల్)

ప్రశాంతి నిలయం: మెదడు వాపు వ్యాధితో ఓ చిన్నారి మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... పుట్టపర్తిలోని కుమ్మరి పేటకు చెందిన ఆటో డ్రైవర్ బాలచందర్, నవ్యశ్రీ దంపతుల కుమార్తె చైత్ర (11 నెలలు) వారం రోజుల క్రితం జ్వరం బారిన పడింది. పుట్టపర్తిలోని సత్యసాయి జనరల్ ఆస్పత్రిలో చికిత్స చేయించేవారు. జ్వరం తగ్గక పోవడంతో కొత్తచెరువులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడా మెరుగు పడకపోవడంతో అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి మెరుగు పడకపోవడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజుల పాటు చికిత్సలు అందించినా ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూ సోమవారం చిన్నారి మృతి చెందింది. మెదడు వాపు వ్యాధితోనే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

- ఈడీ వెంకటేశ్వరరావు



స్థలాల లీజుపై సమావేశమైన ఈడీ వెంకటేశ్వరరావు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ స్థలాల సంరక్షణలో భాగంగా వాటిని లీజుకు ఇస్తున్నట్లు ఆ సంస్థ ఈడీ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం అనంతపులోని ఆర్‌ఎం కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులతో ఆయన సమావేశమై మాట్లాడారు. మొత్తం 20 మంది ఔత్సాహిక వ్యాపారస్తులు పాల్గొన్నారు. ఆర్‌ఎం కార్యాలయానికి ఉత్తరాన ఉన్న ఖాళీ స్థలాన్ని 33 సంవత్సరాల కాలపరిమితికి లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచే టెండర్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ-బిడ్ పద్ధతిలో టెండర్లను ఖరారు చేస్తామన్నారు. అనంతరం అనంతపురం డిపో, గుత్తి డిపోను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్‌ఎం రమేష్‌బాబు, డిపో మేనేజర్ నాగభూపాల్, పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



నిఖితారెడ్డి (ఫైల్)



మృతుడు నిస్సార్ అహమ్మద్

గోరంట్ల/హిందూపురం అర్బన్: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వీరిలో ఒకరు విద్యుత్ షాక్ గురై మృతి చెందగా... మరొకరు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...

- గోరంట్ల మండలం పుట్టగుండ్లపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి, పుష్పలత దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె నిఖితారెడ్డి (15) తొమ్మిదో తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం స్నానం చేసేందుకు బాత్రూమ్‌కు వెళ్లిన ఆమె నీటి కొళాయిని తాకగానే విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా కొళాయికి విద్యుత్ సరఫరా జరిగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బరాయుడు అక్కడు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- హిందూపురం పట్టణానికి చెందిన ఎంఐఎం నాయకుడు నిస్సార్ అహమ్మద్ (58) సోమవారం ఉదయం బళ్లారికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని వెంటనే వెనుదిరిగాడు. మంగళవారం వేకువజామున అనంతపురం జిల్లా కణేకల్లు క్రాస్ వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డుగా వచ్చిన పశువును ఢీకొని వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తలకు బలమైన గాయమైన నిస్సార్ అహమ్మద్‌ను అటుగా వెళుతున్న వారు గమనించి, సమాచారం అందించడంతో సమీపంలో ఉన్న బంధువులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని హిందూపురానికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

‘ఓపెన్’ డిగ్రీ ప్రవేశ గడువు పొడిగింపు

రాప్తాడు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం ప్రవేశాల దరఖాస్తుకు ఈ నెల 16 వరకు గడువు పొడిగించినట్లు మహిళా అభ్యసనా సహాయ కేంద్రం (నగరపాలక సంస్థ కార్యాలయం పక్కన) కో ఆర్డినేటర్ ఎస్.లక్ష్మీరంగయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్, తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎడ్, నర్సింగ్ చదువుతున్న విద్యార్థులకు అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ వరం లాంటిదన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఈ నెల 16లోగా ట్యూషన్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 08554-245908, 94901 21294 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

అమడగూరు: మండలంలోని జౌకలకొత్తపల్లి గ్రామానికి గుడిసిపల్లి నరసమ్మను 1991లో హత్య చేసిన కేసులో నిందితుడు హరిజన గుడిసిపల్లి మస్తాన్‌ను అరెస్ట్ చేసినట్లు ఓడీ చెరువు ఎస్‌ఐ గోపి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 32 ఏళ్ల క్రితం జరిగిన హత్య కేసులో అప్పట్లోనే ఐదుగురిపై కేసు నమోదు చేయగా వారిలో నలుగురు జైలు కెళ్లి కోర్టులో విచారణకు హాజరవుతున్నారన్నారు. ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉంటూ తప్పించుకుని తిరుగుతున్న మస్తాన్‌ను మంగళవారం జౌకలకొత్తపల్లిలో గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.